లక్షకో హత్య

టెంపోరావ్

రాజారావు కారు పోర్టికోలో ఆగింది. డ్రయివర్ తలుపు తెరచాడు. అతను ఠీవిగా దిగి హాల్లోకి వెళ్ళాడు. హాల్లో నాలుగు ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

భార్య ప్రమీల అతడికి యెదురైంది.

"భోజనం చేస్తారా? వడ్డించమననా?" అడిగిందామె.

అతడు భార్యవైపు చూడలేదు.

"ఆలస్యంగా తింటాను. వంటామెను యింటికి పొమ్మను" అని అతడు పైకి వెళ్ళాడు.

పడగ్గది పక్కనే బాత్రూమ్ వుంది. రాజారావు దుస్తులు మార్చుకొని బాత్రూమ్‌లోకి నడిచాడు.

"నమస్కారం, సార్" అన్నాడు రామ్మూర్తి.

తను యింట్లో పెట్టుకున్న బాత్రూమ్‌కి మేనేజర్‌గా ఉంటున్నాడు రామ్మూర్తి.

సోఫాలో కూర్చుని రాజారావు అతడివైపు చూశాడు.

"గెట్ మి స్కాచ్! షీ వాస్ రీగల్" అన్నాడతను.

రామ్మూర్తి వినయంగా వెళ్ళాడు. కాస్సేపట్లో ఒక గ్లాసు తెచ్చి అతడిముందు పెట్టాడు. సోడా యెంత కలపాలో, ఐస్ క్యూబ్స్ యెన్ని వేయాలో రామ్మూర్తికి బాగా తెలుసు. రాజారావుకి తన బార్రూమ్ మేనేజర్ మీద చాలా విశ్వాసం ఉంది.

రామ్మూర్తి అతడి సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆ పని అవగానే తిన్నగా అతడు బార్రూమ్‌కి చేరుకుంటాడు. పట్నంలో సులువుగా తిరగడానికి కంపెనీ రామ్మూర్తికి ఒక స్కూటర్ యిచ్చింది. యెంత పెట్రోలు ఖర్చయినా కంపెనీ యిస్తుంది.

ప్రమీల మౌనంగా వచ్చి భర్త పక్కనే మరో సోఫాలో కూర్చుంది. ప్రమీలంటే అతడికంతగా ఇష్టం లేదు. ఆమె తన మేనత్త కూతురు. చిన్నతనంలో పెళ్ళయి పోయింది.

రామ్మూర్తి ఆమె పక్కకు వచ్చాడు.

"ఏదేనా పట్రానా?" అడిగాడు.

"కాంపాకోలా" అందామె.

గ్లాసుడు తెచ్చి రామ్మూర్తి ఆమెకందించాడు.

"మై డ్రింకింగ్ కంపానియన్!" అని నవ్వుతూ రాజారావు విస్కీ తాగాడు.

రెండు బడా పెగ్గులు తాగేసి రాజారావు టైము చూశాడు. పది దాటింది. ఆవులిస్తూ ప్రమీల సోఫా లోంచి లేచింది.

"నేను వెళ్ళి పడుకుంటాను. నిద్రవస్తోంది."

"గుడ్ నైట్" అన్నాడు భర్త.

ఆమె వెళ్ళిపోయింది. రాజారావు, నవ్వుతూ

రామ్మూర్తి అటంక చూశాడు.

"ఈ రాత్రికి యెవర్ని తీసుకొచ్చావు?" అడిగాడతను సిగరెట్ పొగ వదుల్తూ.

"మూడు నెలలనుంచి ఆమెకోసం ప్రయత్నం సాగిస్తున్నాను. ఆమె యివాళ దొరికింది. పేరు రోజా. ఆమె భర్త నైట్ షిఫ్ట్‌లో ఫాక్టరీకి వెళ్ళాడు. నాలుగింటికి యింటికి వస్తాడు. ఆ లోపలే ఆమె యిల్లు చేరుకోవాలి!" అన్నాడు రామ్మూర్తి.

"ఆ బాధ్యత నీది!" అన్నాడు రాజారావు.

"ఆమెను మీ గెస్టు రూమ్‌లో ఉండమన్నాను. 3-30కి తీసుకెళ్ళి ఆమెను యింట్లో దింపేస్తాను."

"గుడ్!"

"సార్, మా పెద్దబ్బాయికి కొత్త స్కూల్లో సీటు వచ్చింది. రెండువేలు విరాళంగా యివ్వాలి."

"రేపు ఆఫీసులో తీసుకో! గెట్ మి అనదర్ పెగ్!" అన్నాడు రాజారావు.

పదకొండుదాకా అతడు స్కాచ్ విస్కీ సేవించాడు. తర్వాత పైనున్న డైనింగ్ హాల్లో భోజనం చేశాడు. రామ్మూర్తి వినయంగా అతడికి వడ్డించాడు.

డిన్నర్ అయేసరికి పదకొండున్నర అయింది. రాజారావు కుర్చీలోంచి లేచాడు.

"ఆమెను నా పడగ్గదిలోకి తీసుకరా!"

"అలాగే సార్. ఎప్పటిలాగే ప్రమీల తాగిన కూల్ డ్రింక్‌లో స్లీపింగ్ పౌడర్ కలిపాను. పొద్దుట యెనిమిద్దాకా ఆమె లేవదు."

"గుడ్! నువ్వు లేకుండా నేను జీవించలేను" అన్నాడు రాజారావు బయటకు నడుస్తూ.

2

తలుపును యెవరో తట్టారు. రాజారావు వెళ్ళి తలుపు తెరిచాడు.

బయట నిలబడి వుంది ఒక యువతి. ఆమెను లోపలకు వెళ్ళమని రామ్మూర్తి వైపు చూశాడు.

"ఈ వెయ్యి నీ దగ్గర వుంచుకో. మంచి పిల్లలాగే వుంది. నువ్వు తలుపు తట్టేసరికి నేనూ నిద్రలో ఉండొచ్చు. 3-30కి తీసుకెళ్ళి ఆమెను యింట్లో దింపా లన్నావుగా! ఈ డబ్బు ఆమెకియ్యి."

"అలాగే సార్. నేను బాత్రూమ్‌లో పడుకుంటాడు"

"భోజనం చేసి పడుకో! గుడ్ నైట్" అని రాజా రావు తలుపు మూశాడు.

సోఫా పక్కనే ఆమె నిలబడి వుంది. అతడామె చెయ్యి పట్టుకొని పెద్ద మంచం దగ్గరకు తీసుకెళ్ళాడు. పరుపుపైన వెల్‌వెట్ దుప్పటి తళతళ మెరుస్తోంది.

ఆమె సిగ్గు పడ్తోంది. వేళ్ళతో ఆమె ముఖ్కు పట్టుకొని మెల్లిగా పిండాడతను. ఆమె కళ్ళలోకి చూశాడు. పొట్టిగా, పచ్చగా బంగారం బొమ్మలా ఉందామె.

"ఇలా యెప్పుడేనా యెక్కడికేనా వెళ్ళావా?" ప్రశ్నించాడతను.

రామ్మూర్తి చెప్పినదంతా ఆమెకు బాగా జ్ఞాపక ముంది.

"ఇదే మొదటిసారి" అందామె.

ఇలా చాలా చోట్లకు వెళ్ళానని జవాబిస్తే రాజా రావు ఆమెను వెంటనే పొమ్మంటాడు.

"యూ స్ట్రీట్ బిచ్!" అని అరుస్తాడు.

అటువంటి యువతిని తీసుకొచ్చినందుకు రామ్మూర్తికి కూడా తిట్లు తప్పవు.

రాజారావు సంతోషంగా ఆమెను పరుపు మీదకు తోశాడు. ఆమె వెల్లకిలా పడింది. ఆమె పక్కకు జరిగి, కళ్ళలోకి చూశాడతను.

"నీకు పెళ్ళయిందని విన్నాను."

ఆమె తలాడించింది.

"పిల్లలున్నారా?"

"లేరు" అందామె.

పిల్లలుంటే రాజారావుకి ఆమె నచ్చదు. రామ్మూర్తి యిదంతా ఆమెకు చెప్పాడు.

"నువ్వు ఎక్కడికొస్తున్నావో ముందుగా తెలుసా?"

ఆమె నవ్వింది.

"మీ పేరు వినే రావడానికి ఒప్పుకున్నాను. మీ గురించి పత్రికల్లో యింతో చదివాను. చిల్లిగవ్వ లేకుండా జీవితం ప్రారంభించి నలభై ఏళ్ళు దాటేలోపల మీరు కోటీశ్వరులు అయ్యారు. ఇదంతా మీరెలా సాధించారో నాకు ఆశ్చర్యంగా వుంది" అందామె.

ఆనందంతో అతడామెవైపు చూశాడు.

"అభిమానంతో నువ్వు ఇక్కడికొచ్చినందుకు సంతోషిస్తున్నాను" అన్నాడతను.

రాజారావు గదిలోని లైటు ఆర్పేశాడు. మరో స్విచ్ నొక్కాడు. జీరో వాట్ బల్బ్ నీలంరంగు కాంతి పరుపు మీద పడ్తోంది.

ఆమె పక్కనే వాలాడతను. దగ్గరగా లాక్కొని ఆమె పెదిమలను బలంగా ముద్దెట్టుకున్నాడు.

బాత్రూమ్‌లో స్కాచ్ సేవిస్తూ రామ్మూర్తి భోజనం

చేస్తున్నాడు. అతడు టైమ్ చూశాడు. పన్నెండు దాటింది.

మరో మూడుగంటలు తర్వాత తను వెళ్ళి తలుపు తట్టి ఆమెను తీసుకెళ్ళి దింపేయాలి!

భోజనం ముగించి అతడు సోఫాలో వాలాడు. కాస్సేపట్లో అతడికి నిద్రపట్టేసింది.

అతడు అలారం విని లేచాడు. రాజారావు గదిముందుకు వెళ్ళి తలుపు తట్టాడు. తలుపు తెరవబడింది. ఆవులిస్తూ ఆమె అతడివంక చూసింది.

"హాయిగా పడుకున్నాను. ఎందుకు లేపావు?" అందామె.

"ఇంటికి పోవాలిగా?"

"ఎందుకీ తొందర?" ప్రశ్నించిందామె.

"నీ భర్త ఫాక్టరీనుంచి నాలుగింటికి తిరిగి వస్తాడని ఆయనతో చెప్పాను."

"లయ్యర్" అందామె.

"పొట్టకోసం యెన్నో అబద్ధాలు చెప్పాలి! గెట్ రెడీ" అన్నాడతను.

కాస్సేపట్లో ఆమె తయారైంది. తన స్కూటర్ మీద ఆమెను రామ్మూర్తి తీసుకుపోయాడు.

చిన్న యింటిముందు స్కూటర్ ఆగింది. ఆమె దిగింది అతడు రెండువందలు ఆమెకిచ్చాడు.

"ఇంతేనా?"

"ఇంకా ఎంత కావాలి?"

"ఆయన్ని స్వయంగా చూశాను. ఆయనది చాలా పెద్ద చెయ్యి. నువ్వు నన్ను మోసం చేస్తున్నావు!" అందామె.

"రోజా, చిన్న హోటల్సుకు పోయి రాత్రల్లా వుండి యాత్రై గడిస్తున్నావు. నీకు రెండువందలు చాలా యెక్కువ!"

"ఎక్కువో, తక్కువో అది వేరే విషయం. ఆయన యిచ్చినది నాకు యిచ్చేయాలి!"

"అంతే యిచ్చారు."

"రేపు నన్ను మళ్ళా రమ్మన్నారు ఆయన. అప్పుడు తేల్చుకుంటానులే."

"నిజంగా ఆయన నిన్ను మళ్ళా రమ్మన్నారా? నాతో ఆయన చెప్పలేదే!"

"రేపు చెప్తారు!"

జేబులో వున్న ఎనిమిదివందలూ ఆమెకిచ్చేసేడతను.

"అలా దారికి రా!" అందామె.

"నాకు యెంతో కొంత యివ్వాలి."

"ఎందుకూ?"

"అక్కడకు తీసుకెళ్ళింది నేనేగా!"

"మీకు ఏమీ యివ్వద్దని ఆయన నాతో అన్నారు. ఆయన నీకు కావలసినంత యిస్తున్నారట."

"ఆయనిచ్చేది వేరు. నువ్వు ఇచ్చేది యియ్యి" అన్నాడతను.

"డబ్బిచ్చే అలవాటు నాకు లేదు. కావలిస్తే రా నా గదికి" అందామె.

రామ్మూర్తి తల బరువెక్కింది. ఆమెవైపు నిస్సహాయంగా చూశాడు.

రోజా గబగబా వెళ్ళిపోయింది. ఆమెకు రెండువందలిచ్చి, యెనిమిది వందలు తను వుంచుకోవాలని అనుకున్నాడు. కాని కథ అడ్డం తిరిగింది.

3

ఆర్. ఆర్. మాన్షన్స్ నాలుగంతస్తుల భవనంలో ఏర్ కండిషండ్ గదిలో కూర్చుని ఉన్నాడు రాజారావు. అతడిముందు విశాలమైన స్టీల్ టేబుల్, టేబుల్ మీద నాల్గు టెలిఫోన్లు ఉన్నాయి.

గదిలో చల్లగా, హాయిగా వుంది. అతడు రిసీవర్ ఎత్తాడు.

"హలో, సార్" అంది ఆపరేటర్.

"రామ్మూర్తిని నా గదికి రమ్మను" అని అతను రిసీవర్ పెట్టేశాడు.

కాస్సేపట్లో రామ్మూర్తి అతడిముందు హాజరయ్యాడు.

"నిన్నటి యువతి...."

"ఇవాళ మళ్ళా ఆమెను తీసుకొస్తాను, సార్" అన్నాడు రామ్మూర్తి అడ్డొస్తూ.

"యూ స్టుపిడ్, నాకు కావల్సింది ఆమె మళ్లా రావడం కాదు. ఆమె దేవాంతకురాల్లా వుంది. నిద్రిస్తూన్న సమయంలో నా పర్సులో వుండే పదివేలు ఆమె పట్టుకు పోయింది."

"ఆమె అటువంటిది కాదు, సార్!"

"రామ్మూర్తీ, ఆమెకు సంతోషంగా వెయ్యి యిచ్చాను. దానితో తృప్తిపడి నా డబ్బు నాకు వాపసు చేయమను."

"ఇప్పుడే వెళ్తాను, సార్."

రామ్మూర్తి గాభరాగా వెళ్ళిపోయాడు. ఆమె ఇంటి వైపు స్కూటర్ని పోనిచ్చాడు.

ఇప్పుడామెకు బుద్ధి చెప్పాలి. నిన్న యిచ్చిన వెయ్యిలో తనకు రావలసిన 800 కూడా లాక్కోవాలి!

చిన్న యింటిముందు స్కూటర్ ఆపి అతను దిగాడు. ఆమె గది తలుపును తట్టాడు. తలుపు తెర్చిన నీగ్రో యువకుడిని చూసి అతడు తృళ్ళిపడ్డాడు.

"వాట్?" అర్చాడు నీగ్రో.

"రాజా" అన్నాడతను.

మరో గదిలోంచి వచ్చిందామె.

"మీరా, రండి" అందామె.

నీగ్రో ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమెవైపు రామ్మూర్తి సూటిగా చూశాడు.

"ఈ నీగ్రో ఎవరు?"

"నైజీరియానుంచి వచ్చాడితను. పేరు టామ్. ఇక్కడ చదువుతున్నాడు. నన్ను పెళ్ళాడాలని అతడి ఆశ" అందామె.

టామ్ అమాంతంగా లేచి రామ్మూర్తి చెయ్యిని పట్టుకొని నలిపేశాడు.

"గ్లాడ్ టు మీట్ యు!" అన్నాడతను.

"ఫామిలీ ఫ్రెండ్ రామ్మూర్తి" అని ఆమె పరిచయం చేసింది.

టామ్ పిశాచంలా వున్నాడు. కాని తన పని తను చేసుకుపోవాలి!

"రాజా, నిన్న ఆయన పర్సులోని పదివేలు నువ్వు పట్టుకుపోయావట. ఆయన పొద్దుటే అది చూసుకున్నారు. ఆ డబ్బు పట్టుకెళ్ళడానికి వచ్చాను" అన్నాడతను.

"పట్టుకు వెళ్ళు" అందామె.

"ఆ డబ్బు యిలా యివ్వు."

ఆమె పకపక నవ్వింది.

"నా చేతిలో పడ్డ డబ్బు తిరిగిరాదు. అది తెల్సుకో!

కాని ఏదీ చెయ్యకపోతే ఆయన నిన్ను తిడ్తాడు. నీ ఉద్యోగం కూడా పోవచ్చు. నేను చెప్పినట్లు చేస్తే నీకు ప్రమాదం ఉండదు.''

"ఏం చెయ్యాలి?"

"నేను వచ్చేసరికే నా భర్త యింట్లో ఉన్నాడు. మా యిద్దరికీ పోట్లాటయింది. నా భర్త నన్ను చావ గొట్టాడు. నేను హాస్పిటల్లో ఉన్నానని చెప్పు. యిది పోలీసు కేసు కావచ్చని చెప్పు. రేపు కోర్టులో ఆయన యింటికి వెళ్ళినట్లు చెప్పొచ్చు. అది ఆయనకు మంచిది కాదు! అలా చెప్పి చూడు! పొట్టకోసం అబద్ధా లాడాలిగా!"

"చూస్తాను, ఆయన యేమంటారో!"

"ఆయన్ని నమ్మించు. నీ తెలివి తేటలు ఉపయోగించు! నిన్ను కాపాడుకుంటూ నన్ను కాపాడు" అందామె.

"నాకే ప్రమాదం లేదు" అన్నాడతను.

"చిన్న హోటల్లో పోయే నాలాటి వేశ్యను ఆయన యింటికి తీసుకెళ్ళావు. నాకు పెళ్ళయినట్లు ఆయనతో చెప్పావు. నిజం ఆయనకు తెలిస్తే ఆయన నిన్ను పొమ్మం టారు. అందువలన నన్ను కాపాడే బాధ్యత నీది" అందామె.

"తన్ని మోసగిస్తే ఆయన మన్నించరు!"

"మనిద్దరం మోసం చేశాంగా! నేను మొదట చెప్పిన కథ చెప్పి ఆయన్ని శాంతపర్చు!"

రామ్మూర్తి లేచాడు. అతడితో కరచాలనం చేయ డానికి టామ్‌కూడా లేచాడు. కాని టామ్‌కు తన చెయ్యి అందకుండానే రామ్మూర్తి బయటకు పరుగెత్తాడు.

"ఫన్నీ మేన్!" అన్నాడు టామ్ ఆమెతో.

ఎదురుగా నిలబడిన రామ్మూర్తివైపు రాజారావు సిగరెట్ పొగ వదులుతూ చూశాడు.

"ఇచ్చిందా?"

"ఆమె యిచ్చే స్థితిలో లేదు, సార్."

"ఏమైంది?"

"నేనామెను యింటి సమీపంలో 3-45కి వదిలి వెళ్ళిపోయాను. ఆమె భర్త యివాళ తెల్లారుజామున 3-30కే వచ్చాడట. ఆమెను యెక్కడికెళ్ళావని ప్రశ్నించాడు. ఆమెను చావగొట్టాడు. ఆమె హేండ్ బాగ్ లో ఉన్న పదకొండువేలు అతడు చూశాడు. అనుమానం ఎక్కువై యింకా కొట్టాడు. చివరకి యీ కేసు పోలీసులదాకా వెళ్ళొచ్చు. హాస్పిటల్లో ఉందామె. అక్కడకు వెళ్ళి ఆమెను చూశాను. అంతా ఆమె నాతో చెప్పింది. డబ్బు అడగడానికి మనస్సు రాలేదు నాకు. వెనక్కి తిరిగొచ్చాను."

"పూర్ ఫెలో, ఒక రాత్రి నాతో గడిపినందుకు చాలా కష్టపడింది."

"అవును సార్. ఇప్పుడు ఏం చేద్దాం?"

"ఈ కేసు పోలీసులదాకా వెళ్ళకుండా చూడ్డం మంచిది. రేపు కోర్టులో నా యింటికి వచ్చినట్లు ఆమె చెప్తే బాగుండదు. పదివేలు వదిలేద్దాం. ఆ డబ్బుపోయినా నాకు లెక్కలేదు."

"అలాగే చూస్తాను, సార్."

రామ్మూర్తి వెనక్కి తిరిగి వెళ్తున్నాడు.

"ఇదిగో, రామ్మూర్తీ!"

అతడు ఆగి వెనక్కి తిరిగాడు.

"ఆమె యే హాస్పిటల్లో ఉంది?" అడిగాడు రాజా

రావు.

"ఎందుకు సార్?"

"నా మూలంగా అన్ని దెబ్బలు తిన్న రోజాను ఒకసారి వెళ్ళి చూస్తాను."

రామ్మూర్తి గుండె దడదడలాడింది. తనిప్పుడు ఏం చెప్పాలి?

"హాస్పిటల్ పేరు చూడలేదు. కావలిస్తే నేను మిమ్మల్ని తీసుకెళ్తాను."

"పద, వెళ్దాం" అని రాజారావు లేచాడు.

రామ్మూర్తి కదల్లేదు. అతడి దగ్గరకొచ్చాడు రాజారావు.

"పద! కదులు!" అర్చాడు.

రామ్మూర్తిలో చలనం లేదు.

"రాస్కెల్! నువ్వు యేదో దాస్తున్నావు నిజం చెప్పు!"

రామ్మూర్తి అతడి కాళ్ళమీద పడిపోయాడు.

"ఆమె మోసకత్తె. పరమ దొంగ. ఆమె మాటలు నమ్మి, అందంగా ఉందని మీ యింటికి తీసుకొచ్చాను. ఆమె బరితెగించినమనిషి. డబ్బు యివ్వనంది. చేతిలో కొచ్చినది తిరిగిచ్చే అలవాటు తనకు లేదంది. ఒక నీగ్రో ఆమెకు బాడీగార్డుగా వుంటున్నాడు."

"ఆమె భర్త ఏమయ్యాడు?"

"అతడే ఆమె కాబోయే భర్త!"

"అంతా ఫిషీగా ఉంది. ఆమె యెక్కడుంటోంది?"

"అడ్రెసు తెలియదు, యిల్లు తెలుసు."

"రాత్రి వెళ్దాం" అన్నాడు రాజారావు.

"అలాగే సార్."

4

రోడ్డు దీపాలు వెలుగుతున్నాయి. పోలీస్ జీప్ వేగంగా కదులుతోంది.

"కుడివైపుకు తిరగాలి" అన్నాడు రామ్మూర్తి.

ఇన్‌స్పెక్టర్ ఆజాద్ పక్కనే రామ్మూర్తి కూర్చుని ఉన్నాడు. టైమ్ పది దాటింది.

"ఇంకా ఎంత దూరం వెళ్ళాలి?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆజాద్.

"వస్తున్నాం."

చిన్న ఇంటిముందు పోలీస్ జీప్ ఆగింది. ఒక గుమ్మం వైపు రామ్మూర్తి చెయ్యి చూపించాడు.

"ఆ ఫ్లాట్‌లో వుంటోందామె," అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్ ఆజాద్ కిందకు దిగాడు.

"మీరు జీప్‌లోనే కూర్చోండి" అన్నాడు యిన్‌స్పెక్టర్ రామ్మూర్తిని ఉద్దేశించి.

ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్ళు గుమ్మంముందుకు వెళ్ళారు. ఒక కానిస్టేబుల్ తలుపును తట్టాడు.

కొంతసేపయ్యాక తలుపు తెరవబడింది. గళ్ళ పైజామా ధరించిన నీగ్రో పోలీసులవైపు భయంతో చూశాడు.

ఇన్‌స్పెక్టర్ లోపలకు జొరబడ్డాడు. రోజా అర్ధనగ్నంగా యెదురైంది.

"ఏమిటిదంతా?"

"ఇదొక వేశ్యాగృహం. రెయిడ్ చేస్తున్నాం."

"ఇక్కడ నేను తప్ప మరెవ్వరూ లేరు!"

"నువ్వు వేశ్యగా జీవిస్తున్నావు. నీ ఆదాయంమీద అతడు బతుకుతున్నాడు" అన్నాడు యిన్‌స్పెక్టర్.

ఆమె భయంతో ఉండిపోయింది.

"గదులు వెతకండి!" అర్చాడతను.

"దేనికోసం వెతుకుతారు?"

"ఒక పెద్దమనిషి పర్సులోనుంచి నువ్వు పదకొండు వేలు దొంగిలించావు!"

"పదకొండు వేలు కాదు, సార్!"

"ఎంత?"

"పది వేలు" అందామె.

"ఆ డబ్బెక్కడుంది?"

"అది యిచ్చేస్తే పోతారా?"

"ఇచ్చి చూడు!"

ఆమె లోపలకు వెళ్ళింది. డబ్బు తెచ్చి ఇన్‌స్పెక్టర్‌కి యిచ్చింది.

ఇన్‌స్పెక్టర్ నీగ్రో వైపు చూశాడు.

"ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నావు?"

"నా పేరు టామ్. నా దేశం నైజీరియా. ఆమె నా గర్ల్ ఫ్రెండ్."

రోజా ఏడుస్తూ ఇన్‌స్పెక్టర్ వైపు చూసింది.

"సార్, అతను నా ఫ్రెండ్ కాదు. బీచ్‌లో ఒకసారి నన్ను చూశాడు. అప్పటినుంచి వెంటాడి ఇంటికొచ్చాడు. జిడ్డులా నన్ను ఇతను వదలడంలేదు. ఇతడు మళ్లా యిక్కడకు రాకుండా చూడండి!" అందామె.

ఇన్‌స్పెక్టర్ టామ్ వైపు చూశాడు.

"ఆమె చెప్పింది అర్థమైందా?"

"లేదు."

ఆమె చెప్పినదంతా యిన్‌స్పెక్టర్ ఇంగ్లీషులో చెప్పాడు.

టామ్ కోపంగా ఆమెవైపు కోపంగా తిరిగాడు.

"అరస్టు హిమ్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నన్ను అరస్టు చేయొద్దు. నేను మళ్లా యిక్కడకు రాను" అని టామ్, దుస్తులు మార్చుకొని బయటకు కదిలాడు.

"ఇన్‌స్పెక్టర్, మీ మూలంగా ఒక శని విరగడైంది. చాలా థాంక్స్" అందామె.

ఇన్‌స్పెక్టర్ అజాద్, కానిస్టేబుళ్ళు బయిటకు నడిచారు. అందరూ జీప్‌లో కూర్చున్నారు. జీప్ కదిలింది.

"ఆమె డబ్బు యిచ్చిందా?" అడిగాడు రామ్మూర్తి.

"కాన్సెపట్లో చూద్దురుగాని" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

బాత్రూమ్‌లో కూర్చుని రాజారావు స్కాచ్ విస్కీ సేవిస్తున్నాడు. రామ్మూర్తి, ఇన్‌స్పెక్టర్ అజాద్ బాత్రూమ్‌లోకొచ్చారు.

అజాద్ వైపు రాజారావు నవ్వుతూ చూశాడు.

"ఆమె యిచ్చిన పదివేలు సార్" అని నోట్ల కట్టలను టీపాయిమీద వుంచాడు అజాద్.

"గుడ్ వర్క్, మైడియర్ ఫ్రెండ్" అన్నాడు రాజారావు.

రాజారావు దూరంలో వున్న రామ్మూర్తికి సౌజ్ఞ చేసి విస్కీ తెమ్మన్నాడు.

"ఆ డబ్బులోంచి రెండు వేలు నువ్వు తీసుకో" అన్నాడు రాజారావు.

అజాద్ రెండువేలు తీసుకొన్నాడు.

"మీకు ధన్యవాదాలు. గత రెండు నెలలుగా నేను నాటకాల్లో పాల్గొనడం లేదు. మంచి సమయంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నటించే మంచి అవకాశం కల్పించి

పారితోషికం కూడా యిచ్చారు" అన్నాడు అజాద్.

"నీ తతిమా మిత్రులు యేమయ్యారు?"

"వాళ్ళకు డబ్బిచ్చి ఇళ్ళకు పొమ్మన్నాను"

విస్కీ గ్లాసును రామ్మూర్తి అతడికిచ్చాడు.

విస్కీని అజాద్ తాగాడు.

"తనివితీరా కూర్చుని తాగు! నాకు డ్రింకింగ్ కంపానియన్స్ యెప్పుడో గాని దొరకరు!" అన్నాడు రాజారావు.

"అలా అనకండి సార్. అవకాశం వస్తే యెంత మందైనా యిక్కడకొచ్చి తాగుతారు" అన్నాడు అజాద్.

అజాద్, రాజారావు పన్నెండుదాకా విస్కీ సేవిస్తూ కూర్చున్నారు. అజాద్ నిషాలో ఉన్నాడు.

"రామ్మూర్తీ, ఇతడిని తీసుకెళ్ళి గెస్టు రూమ్‌లో పడుకోబెట్టు" అన్నాడు రాజారావు.

"అలాగే సార్" అన్నాడు రామ్మూర్తి.

5

కోటీశ్వరుడు రాజారావు టిఫిన్ సేవించి ముందు హాల్లోకొచ్చి కూర్చున్నాడు. అతడి భార్య ప్రమీల వచ్చి పక్కనే మరో సోఫాలో కూర్చుంది.

ఓరగా ఆమెకేసి చూశాడతను. ఆమె చదువుకోలేదు యెక్కువగా. ఇంట్లో ఆమెకు కాస్తకూడా పనిలేదు. తెలుగు నవలలను చదువుతూ ఆమె కాలక్షేపం చేస్తూ ఉంటుంది.

ఆమె పక్క కూర్చుంటే అతడిలో ఏమీ రగులుకోదు. పెళ్ళయిన మొదట్లో ఇద్దరూ కొంత దగ్గరయినా ఎన్నేళ్ళనుంచో వాళ్ళు వేర్వేరు గదుల్లో నిద్రిస్తున్నారు.

తన జీవితం తనది. ఆమె జీవితం ఆమెది. పేరుకి ఆమె అతడి భార్య. అంతకుమించి వాళ్ళిద్దరి మధ్యా ఎటువంటి అనురాగ బంధాలూ లేవు.

సోఫాలోంచి అతడు లేచి కారువైపు నడిచాడు. మెర్సిడిస్ కారులో కూర్చున్నాడు. డ్రయివర్ తలుపు మూశాడు.

కారు కదిలింది. గేటు దాటి కారు రోడ్డుమ్మట పోసాగింది.

"హోటల్ టాజ్ కి పద!" అన్నాడతను.

టాజ్ హోటల్ ముందు కారు ఆగింది. అతడు దిగి హోటల్ ముందు హాల్లోకి వెళ్ళాడు. హోటల్ మేనేజర్ రామదాస్ యెదురయ్యాడు.

"హలో సార్" అన్నాడతను.

"హలో" అన్నాడు రాజారావు.

రామదాస్ అతడి పక్కనే నడవసాగాడు.

"నా ఫ్రెండ్ రిచర్డు కింగ్ యిక్కడున్నాడని విన్నాను. అతడిని చూడాలి" అన్నాడు రాజారావు.

"ఆయన రూమ్ నంబరు 105లో ఉన్నారు. మీరు లిఫ్టులో రెండో అంతస్థుకు వెళ్ళాలి" అన్నాడు రామదాస్.

"థాంక్స్, నే వెళ్ళగలను" అన్నాడతను.

రామదాస్ వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

రాజారావు లిఫ్టులో యెక్కాడు. లిఫ్ట్ మేన్ అతడికి వినయంగా నమస్కరించాడు.

"సెకండ్ ఫ్లోర్" అన్నాడు రాజారావు.

అదే క్షణంలో ఒక యువతి వేగంగా లిఫ్టులోకి యెక్కింది. ఆమె చెయ్యి రాజారావుకు మెత్తగా తగి

లింది. లిఫ్ట్ పైకి వెళ్తోంది.

ఖరీదైన సూటులో ఉన్న రాజారావు ఆమె వంక చూశాడు. అమాంతంగా అతని నాడుల్లో రక్తం వేగంగా ప్రవహించింది.

ఆమెవైపు అలా చూస్తూనే ఉన్నాడు. అతని హృదయంలో ఏదో కాంతి! ఏదో ఆనందం!

రెండో ఫ్లోర్‌లో లిఫ్ట్ ఆగింది. అతడికంటె ముందు ఆమె దిగింది. వెనకనే అతడు వెళ్ళాడు.

నడవమ్మట ఆమె నడుస్తోంది. ఆమెనే అతను చూస్తున్నాడు. అతడి శరీరం ఆవేశంతో వణుకుతోంది. ఆమె యెవరోగాని తనలో దుమారాన్ని సృష్టించింది.

రాజారావు ప్రపంచంలోని అన్ని దేశాలూ తిరిగాడు. కాని అంత అందమైన యువతిని అతదెక్కడా చూడలేదు.

ఆమె భూలోక సుందరి. సందేహంలేదు.

ఆమె రూమ్ నంబరు 110లోకి వెళ్ళింది. 105 గది ముందు నిలబడిన రాజారావు, ఆమె రూపం మాయమయ్యాక, ముందుకు నడిచాడు. 100 నంబరు గదిముందు క్షణకాలం నిలబడ్డాడు.

అతడి మెదడులో యెన్నో ఆలోచనలు! తలుపుతట్టి ఆమెతో మాట్లాడాలి! ఆమె యెవరో తను తెలుసుకోవాలి!

గుమ్మం ముందు నిలబడ్డాడు కాని తలుపును అతడు తట్టలేదు. మర్యాదగా ఉండదేమో!

అతడు వెనక్కు తిరిగాడు. 105 గదిలోకి వెళ్ళాడు. రిచర్డ్ కింగ్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడు. రిచర్డ్ కింగ్ కోసం అతను యీ హోటల్‌కి వచ్చాడు. కాని

ఆమెను చూశాక రిచర్డుమీద అతని మనసులేదు.

రిచర్డు ఏదో చెప్తున్నాడు. అతడు వింటున్నాడు. కాని అతని మనోఫలకం మీద ఆమె రూపం కనిపిస్తోంది.

"మీ మైండ్ యెక్కడో వుంది!" అన్నాడు రిచర్డు నవ్వుతూ.

"ఇక్కడే వుంది" అన్నాడతను.

రిచర్డుకింగ్ రెండు గ్లాసుల్లో బీర్ పోశాడు. ఇద్దరూ బీర్ తాగుతూ కూర్చున్నారు.

"ఫైన్ జర్మన్ బీర్" అన్నాడు కింగ్.

ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు. గ్లాసులోని బీరును తాగేసి రాజారావు లేచాడు.

"నేను సాయంత్రం మమ్మల్ని మళ్ళా కలుసుకుంటాను. అర్జంటు పనులున్నాయి. వెళ్ళాలి" అతడికి బైబై చెప్పి రాజారావు బయటకు నడిచాడు.

కిందనున్న మేనేజర్ గదిలోకి వెళ్లాడతను. రామదాస్ కుర్చీలోంచి లేచాడు.

"కూర్చోండి, సార్" అన్నాడు మేనేజర్.

అతడివైపు రాజారావు సూటిగా చూశాడు.

"నాకు చిన్న సహాయం రహస్యంగా మీరు చెయ్యాలి" అన్నాడు రాజారావు.

"ఏం కావలసినా చేస్తాను, సార్" అన్నాడతను.

"110 నంబరు గదిలో ఒక యువతి ఉంటోంది. ఆమె పేరు యేమిటి? ఆమె యెందుకీ హోటల్లో బస చేస్తోంది? అంతా నాకు కావాలి!"

"ఇప్పుడే కనుక్కొని వస్తాను" అని మేనేజర్ రామదాస్ బయటకు వెళ్ళాడు.

సిగరెట్ తర్వాత సిగరెట్ పీల్చి పారేస్తున్నాడు

రాజారావు. పదిహేను నిమిషాల తర్వాత అతను తిరిగి వచ్చాడు.

"ఆమె పేరు మేనక. ఆమె బొంబాయినుంచి వచ్చింది. ఆమె క్లాత్ బిజినెస్‌లో వుంది. చీరలు, పాంటు పీసెస్ ఆమె దగ్గర ఉన్నాయి. ఈ పట్నంలో మంచి డిస్ట్రిబ్యూటర్ కోసం ఆమె వెతుకుతోంది" అన్నాడు మేనేజర్.

"మిస్టర్ రామదాస్, ఆర్. ఆర్. టెక్స్టయిల్స్ కంపెనీతో ఆమెను సంప్రదించమనండి."

"ఆ కంపెనీ ఎక్కడుంది?"

రాజారావు తన ఆఫీసు ఫోన్ నంబరు యిచ్చాడు.

"ఆ నంబర్లకు ఫోన్ చేసి నాతో ఆమెను మాట్లాడమనండి" అన్నాడతను.

"మీరు డిస్ట్రిబ్యూషన్ తీసుకుంటానంటే ఆమె కళ్లు మూసుకొని యిస్తుంది. మంచి పార్టీ కోసం ఆమె చూస్తోంది. ఇంతవరకూ యెవరూ ఆమెకు నచ్చలేదుట."

"ఇవాళే ఫోన్ చేసి నాతో మాట్లాడమనండి. ఆలస్యం దేనికి!"

"అలాగే సార్" అన్నాడు రామదాస్.

6

ఆనాటి మధ్యాహ్నం మూడింటికి ఆమె ఫోన్ చేసింది. టెలిఫోన్ ఆపరేటర్ రాజారావుతో మాట్లాడింది.

"సార్, ఆర్.ఆర్. టెక్స్టయిల్స్ కావాలంటోందామె. ఆమె పేరు మేనకట. అటువంటి కంపెనీ ఇక్కడ లేదుగా!" అందామె.

"ఆమెతో ఏం చెప్పావు?"

"కాస్సేపు ఉండమన్నాను. మీరు కొత్త కంపెనీలు

పాపిస్తూ వుంటారని నాకు తెలుసుగా!"

"గుడ్, మిస్ మేరీ! కనెక్టు హర్ టు మి!"

ఈ స్పేపట్లో కనెక్షన్ వచ్చింది.

"హలో, రాజారావు హియర్" అన్నాడతను.

"హలో, ఐయామ్ మేనక ఫ్రమ్ బొంబే. మా గుడ్స్ డిస్ట్రిబ్యూషన్ గురించి మీతో మాట్లాడాలి. మీ గురించి యెంతో విన్నాను. యెప్పుడు మీరు నాతో మాట్లాడగలరు?" అందామె.

"మీరు వెంటనే యిక్కడకు రాగలరా?"

"వస్తాను" అందామె.

"అయితే వెంటనే రండి" అని అతడు రిసీవర్ పట్టేశాడు.

అతడు రిసీవర్ ఎత్తాడు. టెలిఫోన్ ఆపరేటర్ "హలో, సార్" అంది.

"నటరాజాన్ని వెంటనే రమ్మను" అన్నాడతను.

మరుక్షణంలో నటరాజన్ గదిలోకొచ్చాడు.

"పదినిమిషాల్లో ఆర్.ఆర్. టెక్స్టయిల్స్ అనే బోర్డు బయట తగిలించాలి" అన్నాడతను.

"చేయిస్తాను, సార్" అని అతడు బయటకు పరుగెత్తాడు.

ఆర్.ఆర్. మాన్షన్స్ ముందు టాక్సీ ఆగింది. మేనక కిందకు దిగింది. ఆమె చేతిలో చిన్న సూట్ కేసు వుంది.

ఆమె కంపెనీల బోర్డులవైపు పరీక్షగా చూసింది.

పైకి వెళ్ళింది. రిసెప్షన్ కౌంటరు వెనుకనున్న యువతితో మాట్లాడింది.

"రాజారావుగార్ని కలుసుకోవాలి. ఆయన నన్ను రమ్మన్నారు" అందామె.

"ఒన్ మోమెంట్, ప్లీజ్" అందామె.

మేనక కౌంటరు ముందు నిలబడి వుంది.

"ఆ గదిలోకి వెళ్ళండి" అంది రిసెప్షన్ యువతి.

మేనక ఏర్ కండిషండ్ గదిలోకి అడుగుపెట్టింది. రాజారావు ఆమెను సోఫాలో కూర్చోమని, పక్కనే కూర్చున్నాడు.

ఆమె వైపు చూస్తూ వుండిపోయాడు.

ఆమెలో విపరీతమైన ఆకర్షణ వుంది. ఎంతగా ఆమె వైపు చూసినా తనివితీరడంలేదు.

ఆమె అతడి చూపును గుర్తించింది. సూట్‌కేస్ తెరిచింది. శాంపిల్స్ చూపించింది.

"బొంబేలోని మూడు టెక్స్టయిల్ మిల్స్‌కు మేము డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉంటున్నాం. ఈ శాంపిల్సు నచ్చితే మీరు మద్రాసు పట్నానికి మా సోల్ డిస్ట్రిబ్యూటర్స్‌గా వుండొచ్చు" అందామె.

"మీ శాంపిల్సు నాకు బాగా నచ్చాయి. మీకు మేం సోల్ డిస్ట్రిబ్యూటర్స్‌గా వుంటాం. మీ టరమ్స్ చెప్పండి" అన్నాడతను.

"లక్షరూపాయలు మీరు మాకు డిపోజిట్‌గా కట్టాలి. దానిమీద మీకు వడ్డీ రాదు. అటుపైన మీరు కావలసిన స్టాకు కొనుక్కోవచ్చు. కనీసం యాభై వేలకు తగ్గకుండా మీ ఆర్డరు ఉండాలి" అందామె.

"ఒప్పుకుంటున్నాను."

"మాకు 15% కమిషన్‌గా వస్తుంది. మీకు మేం 10% కమిషన్ యిస్తాం. మాకు 5% మాత్రం మిగులుతుంది."

"ఆగ్రీడ్" అన్నాడతను.

ఆమె సంతోషంగా అతడివైపు చూసింది.

"మేనకా, మీకు లక్షరూపాయలు డిపాజిట్ గా ఇస్తాను. ఐదులక్షల రూపాయల విలువైన టెక్స్టయిల్స్ మీరు మాకు వెంటనే పంపొచ్చు" అన్నాడతను.

అతడు చెప్పింది విని ఆమె ఉలిక్కిపడింది.

"ఐదు లక్షలు! బిగ్ ఆర్డరు!" అందామె.

"మీరు బాంకిద్వారా డాక్యుమెంట్స్ పంపొద్దు. డైరక్టుగా పంపండి. మీకు నేను యిప్పుడు ఆరులక్షలకు చెక్కు యిస్తాను" అన్నాడతను.

"చెక్కొద్దు. మా కంపెనీ పేర డి.డి. యివ్వండి" అందామె.

"అలాగే యిస్తాను" అన్నాడతను.

"మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాను. మూడు రోజుల్నించి తిరుగుతున్నాను. ఒక్క మంచి కంపెనీ కూడా నాకు దొరకలేదు" అందామె.

"మేనకా, బ్యాంకి టైమ్ యివాళ అయిపోయింది. రేపు మీకు డి.డి. యిస్తాను" అన్నాడతను.

"దటీస్ ఓ.కె, సార్" అందామె.

అతడు ఆమెవైపు సూటిగా చూశాడు.

"మీరు హోటల్లో ఉండడం నేను భరించలేను. మేం మీ సోల్ డిస్ట్రిబ్యూటర్లం. వెంటనే హోటల్ గది వదిలేసి మీరు నా యింటికి రండి. మీకు అన్ని సౌకర్యాలు చేకూరేటట్లు నేను చూస్తాను" అన్నాడతను.

కాస్సేపు ఆమె మాట్లాడలేదు. అతడామె వైపు మళ్ళా నవ్వుతూ చూశాడు.

"నా యిల్లు హోటల్ తాజ్ కంటె బాగుంటుంది.

అక్కడ మీరు సంతోషంగా వుండొచ్చు."

"మీరు పిల్చాక కాదనగలనా! హోటల్ గది వదిలేసి యీ రాత్రి మీ యింటికొస్తాను" అందామె.

"మీరు యెప్పుడు వస్తారు?"

"ఎనిమిది తర్వాత" అందామె.

"నేను మీకు కారు పంపుతాను. మా కంపెనీలకు 100 కార్లపైన ఉన్నాయి" అన్నాడతను.

"మీకు నా ధన్యవాదాలు" అందామె.

ఆమె సోఫాలోంచి లేచింది. అతడికి నమస్కరించి ఆమె వెళ్ళిపోయింది.

రాజారావు సోఫాలో కూర్చుని ఆమెను గురించే కలలుకంటూ ఉండిపోయాడు.

7

ఎనిమిదింటికి రాజారావు తన మెర్సిడిస్ కారును హోటల్ టాజ్‌కు పంపాడు.

బాత్రూమ్‌లో రాజారావు కూర్చున్నాడు. స్కాచ్ విస్కీ సేవిస్తున్నాడు.

రామ్మూర్తి వినయంగా అతడి పక్కకు వచ్చాడు.

"ఇవాళ రాత్రి మీకు ఫెస్టివల్" అన్నాడతను.

"ఏమిటది?

"ఒక కాలేజి స్టూడెంట్ నాకు దొరికింది. ఆమెను యిక్కడకు తీసుకొచ్చి గెస్టు రూమ్‌లో ఉంచాను" అన్నాడతను.

"రామూర్తీ, ఆమెను వెంటనే పంపేయి" అన్నాడు రాజారావు.

"కష్టపడి తీసుకొచ్చాను. ఎలా పొమ్మనడం?" అడిగాడు రామ్మూర్తి.

రాజారావు అతడికి వెయ్యి రూపాయలు యిచ్చాడు.

"ఇది యిచ్చి ఆమెను పొమ్మను" అన్నాడతను.

"అలాగే సార్" అన్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తి గెస్టురూమ్‌లోకి వెళ్ళాడు. ఆ గదిలో వున్న యువతివైపు చూశాడు.

"అమ్మాయి రా!" అన్నాడతను.

ఆమె అతడి వెనకనే వెళ్ళింది.

"రాజారావుగారి ఆరోగ్యం బాగాలేదు. అందువలన నిన్ను పంపేస్తాను" అన్నాడతను.

విచారవదనంతో ఆమె అతడివైపు చూసింది.

"నేను చాలా కష్టంలో వున్నాను. కాలేజి ఫీజ్ కట్టాలి," అందామె

"నా ముందు స్టూడెంట్ గా నటించకు!"

"వస్తిపోతాను. ఎంతో కొంత ఇవ్వండి, పోతాను" అందామె.

అతను ఆమెకు 200 రూపాయలు యిచ్చాడు.

"రేపు ఫీజు కట్టు" అన్నాడు నవ్వుతూ.

"మీకు చాలా థాంక్స్. సార్" అందామె.

ఆమెను తీసుకెళ్ళి బస్టేండ్ దగ్గర దింపేశాడతను. "నాకు పనులున్నాయి. గుడ్ నైట్" అని అతడు తన స్కూటర్ని పోనిచ్చాడు.

రామ్మూర్తి బాత్రూమ్‌లోకి ప్రవేశించాడు. రాజారావు దగ్గరగా వెళ్ళాడు.

"రామ్మూర్తీ, ఒక యువతి నా మెర్సిడెస్ కార్లో వ స్తుంది. ఆమెకు గెస్టురూమ్ చూపించు. తర్వాత ఆమెను యిక్కడకు తీసుకురా!" అన్నాడు రాజారావు.

"అలాగే సార్" అన్నాడతను.

మేనక వచ్చేసరికి తొమ్మిది దాటింది. ఆమెను గెస్టు రూమ్‌లోకి రామ్మూర్తి తీసుకెళ్ళాడు.

"మీరు స్నానం చేయండి. తర్వాత మిమ్మల్ని రాజారావుగారి దగ్గరకు తీసుకెళ్తాను" అన్నాడు రామ్మూర్తి.

"అలాగే" అందామె.

పదింటికి ఆమెను రామ్మూర్తి బార్రూమ్‌లోకి తీసుకొచ్చాడు.

సోఫా చూపించి ఆమెను రాజారావు కూర్చోమన్నాడు. అతడి పక్క సోఫాలో ప్రమీల కూర్చుని వుంది.

"ఈమె నా భార్య ప్రమీల" అతడు పరిచయం చేశాడు.

మేనక నవ్వుతూ ప్రమీలకు నమస్కరించింది.

"మీ యింటికి నన్ను ఆహ్వానించినందుకు చాలా సంతోషిస్తున్నాను" అందామె.

"ఆనందం మాది" అన్నాడు రాజారావు.

"ఆనందాన్ని నలుగురికీ పంచడమే నా జీవితలక్ష్యం" అంది మేనక.

కొంతసేపయ్యాక తనకు నిద్ర వస్తోందని చెప్పి ప్రమీల వెళ్ళిపోయింది.

రాజారావు ఆమెవైపు ఆప్యాయంగా చూశాడు.

"డ్రింక్స్ తీసుకుంటారా?" అడిగాడతను.

"నాకా అలవాటు లేదు" అందామె.

"సాఫ్ట్ డ్రింక్స్" అన్నాడతను.

ఆమె టైమ్ చూసింది.

"ఈ పాటికి నేను భోజనం చేస్తూ వుంటాను" అందామె.

గ్లాసులోని విస్కీని అతడు గడగడ తాగేశాడు.

"పదండి. భోజనం చేద్దాం" అన్నాడు రాజారావు.

ఇద్దరూ డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నారు. రామ్మూర్తి వడ్డించాడు.

ఇద్దరూ తింటూ మాట్లాడుకోసాగారు.

"మీ గురించి చెప్పండి" అన్నాడతను.

"రెండేళ్ళ క్రితం నాకు పెళ్ళయింది. నా భర్త ఆర్మీలో వుండేవారు. జీప్ యాక్సిడెంట్‌లో ఆయన కాళ్ళు పోయాయి."

"వెరీ బాడ్!"

"నా భర్త పేరు జీవన్. ఆయన యెక్కువగా బయటకు వెళ్ళరు. నేను కూడా వుంటే గాని ఆయన కదలరు" అందామె.

రాజారావు ఆమెవైపే చూస్తున్నాడు. బంగారంలాంటి శరీరచ్ఛాయ, కోలమొహం, విశాల నేత్రాలు, సన్నటి నడుం, చిన్న పాదాలు. ఆమె ఎంత వయ్యారంగా నడుస్తుంది!

ఎర్రటి పెదిమలు, దానిమ్మ గింజల్లాంటి పళ్ళు! నుదురు మీద ఎర్రటి తిలకం!

"ఈ వ్యాపారంలోకి మీరు ఎందుకు దిగారు?"

"బొంబాయిలో వున్న మూడు టెక్స్‌టయిల్ మిల్స్ మా కంపెనీని డిస్ట్రిబ్యూటర్‌గా నియమించారు. మాకు సహాయపడాలనే ఉద్దేశంతో — నా భర్త తిరగలేదుగా, అందుకని నేనిక్కడికొచ్చాను" అందామె.

"మీ వ్యాపారం లాభదాయకంగా వుందా?"

"వచ్చేది మాకు చాలు!" అందామె.

రాజారావు నవ్వుతూ ఆమెవైపు చూశాడు.

"మీలో నన్ను యేదో ఆకర్షిస్తోంది!" అన్నాడతను.

ఆమె తీయగా నవ్వింది.

"నా అమాయకత్వమేమో!" అందామె.

"మీరు చాలా అందంగా వుంటారు."

"నన్ను పొగడేస్తున్నారు."

"మీ అంత అందమైన యువతి యీ లోకంలో లేదు" అన్నాడతను.

"లోకాన్ని చూసివచ్చినట్లు మాట్లాడుతున్నారు" అందామె.

"ప్రపంచమంతా నేను తిరిగాను. ఎందరో స్త్రీలను చూశాను."

"ఎంత చూసినా మీరు చూడని లోకం వుంటూనే వుంటుంది" అందామె.

అతడు నవ్వాడు.

"అఫ్‌కోర్స్. యూ ఆర్ రైట్" అన్నాడతను.

భోజనాలు ముగించి యిద్దరూ లేచారు. హాల్లోకి నడిచారు. ఇద్దరూ పెద్ద సోఫాలో పక్క పక్కనే కూర్చున్నారు.

ఆమెను చూస్తూంటే అతని హృదయం ఆనందంతో నిండిపోయింది. ఆమె పక్కన అలా శాశ్వతంగా కూర్చుని వుండాలనిపిస్తోంది. మేగ్నెట్ లా ఆమె అతడిని తన వైపు లాగేస్తోంది. అతడి జీవితంలో యిలా యింతకు ముందు యెన్నడూ జరగలేదు.

వాళ్ళిద్దరూ తప్ప హాల్లో మరెవ్వరూ లేరు. అమాంతంగా ఆమె లేచింది. అతడివైపు చూసింది.

"నేనిక వెళ్ళి పడుకోనా?" అందామె.

"అప్పుడే?"

"నేను పెందరాళే పడుకుని, తొందరగా లేస్తాను" అందామె.

ఆమెవంక అతను తీక్షణంగా చూశాడు.

"నాకోసం కాస్సేపు కూర్చోండి."

ఆమె మాట్లాడలేదు. పక్కనే కూర్చుంది. అతడామె చెయ్యి పట్టుకొన్నాడు.

అతడి చేయి వణుకుతోంది, ఎందుకో!

ఆమె వింతగా నవ్వింది.

"మీ భార్య మీ కోసం ఎదురుచూస్తూ వుంటుంది వెళ్ళండి" అందామె.

"ఆమె గాఢనిద్రలో వుంటుంది" అన్నాడతను.

కొంతసేపు యిద్దరూ మౌనంగా వున్నారు.

"నా చిన్నతనంలో నా పెళ్ళయిపోయింది. నా భార్య అంటే నా కెందుకో నచ్చదు. నేను కష్టపడి యెన్ని కోట్లో సంపాదించాను. కాని నాకు ఆనందం లేదు!" అన్నాడతను ఉద్రేకంతో.

"ఆనందంకోసం మీరు వెతకనక్కరలేదు. అది మీరున్నచోటే వుంది!"

"అవును, యిక్కడే వుంది. నా కానందాన్ని యివ్వగల వ్యక్తి నువ్వే!" అన్నాడతను.

ఆమె కిల కిల నవ్వింది.

"వెళ్ళి పడుకుంటాను, గుడ్ నైట్!" అని ఆమె తన గెస్టురూమ్‌లోకి వెళ్ళిపోయింది.

రాజారావు సోఫాలో అలాగే కూర్చున్నాడు. ఆమె తలుపు మూసింది.

రామ్మూర్తి అతడి ముందుకు వచ్చాడు. "వెళ్తాను,

సార్" అన్నాడతను.

"గుడ్ నైట్!" అన్నాడు రాజారావు.

8

రాజారావు కారును పోనిస్తున్నాడు. ఆమె పక్కనే కూర్చుంది.

"మేనకా, నువ్వు బొంబే వెళ్ళిపోతున్నావు. నిన్ను చూడకుండా నే నుండలేను. ఐ లవ్ యూ!" అన్నాడతను.

"సారీ, నేను పెళ్ళయిన స్త్రీని.

"పెళ్ళయితే కావచ్చు. అతడిని వదిలేసి నన్ను పెళ్ళాడు!"

"అదెలా వీలవుతుంది?"

"ఎందుకు కాదు? ఈ లోకంలో సాధ్యంకానిది లేదని నా నమ్మకం."

"నన్ను క్షమించండి," అందామె.

అతను రోడ్డు వారగా కారును ఆపాడు. ఆమెవైపు సూటిగా చూశాడు.

"కాళ్ళు లేని అతడికోసం బలయిపోయి నీ జీవితాన్ని వ్యర్థం చేసుకోకు!"

"ప్లీజ్, కారును పోనీయండి. ఆలస్యమైతే విమానం వెళ్ళిపోతుంది" అందామె.

"డోంట్ బాదర్! నిన్ను చార్టర్డు ప్లేన్‌లో బొంబే పంపిస్తాను" అన్నాడతను.

ఆమె మౌనంగా వుండిపోయింది.

"నువ్వు తప్ప మరెవ్వరూ నన్ను ఆనందపర్చలేరు. నా కోసం పుట్టిన నువ్వు అన్యాయంగా జీవన్ హస్తాల్లో యిరుక్కున్నావు. అతడిని వదిలేసి నాతో వుండిపో!"

"జీవన్ని నేను వదల్లేను!"

"ఎందువలన?"

"అతడికి నేను కావాలి. అతడికి నేను అత్యావసరం" అందామె.

"సిల్లీ! ఒక నర్సును పెద్దాం. ఆమె అతడిని సవ్యంగా చూసుకుంటుంది."

"నర్స్ సేవ చేయొచ్చు కాని నాలా ప్రేమ నివ్వలేదు!"

"కాళ్ళు లేనివాడికి ప్రేమెందుకు?"

ఆమె అతడివైపు కోపంగా చూసింది.

"నేను ప్రస్తుతం యేం చెప్పినా మీకు అర్థంకాదు. మీ శరీరం కోరికల పుట్ట అయింది. కాని నేను మిమ్మల్ని పెళ్ళాడలేను. జీవన్ లేకపోతే ఆ అవకాశం వుండేదేమో!"

ఆమెవైపు చూశాడతను.

"మీ భార్య ప్రమీల వుంది. ఆమె వుండగా మరో పెళ్ళి మీరు చేసుకోవడం ధర్మంకాదు!"

"నా భార్యా, నీ భర్తా లేరనుకో, అప్పుడు?"

"అప్పుడు పెళ్ళికి ఒప్పుకునేదాన్ని" అందామె.

అతడు కారును పోనిచ్చాడు.

"మేనకా, నన్ను పెళ్ళాడినా, పెళ్ళాడకపోయినా నిన్ను ప్రేమిస్తూనే వుంటాను. చివరకి దేవుడు యేం చేస్తాడో చూద్దాం" అన్నాడతను.

"అది మంచి పద్ధతి" అందామె.

విమానాశ్రయంలో మేనక అతడితో కరచాలనం చేసింది.

"బొంబే వస్తే తప్పక మా యింటికి రండి!"

అందామె.

"బిజినెస్ మీద నేను బొంబే తరచు వస్తూంటాను. మీ యింటికి తప్పక వస్తాను" అన్నాడతను.

ఆమె ప్రయాణం చేస్తూన్న విమానం ఆకాశంలో దూసుకుపోతోంది. అతడు తన కారును ఆఫీసువైపు పోనిచ్చాడు.

9

బొంబే!

ఎవరో తలుపును తట్టారు. మేనక వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా నిలబడిన రాజారావువైపు నవ్వుతూ చూసింది.

"ఉత్తరం రాయకుండానే వచ్చేశారు!" అందామె.

"ఉత్తరాలు రాసే అలవాటు లేదు నాకు," అన్నాడతను నవ్వుతూ.

ఆమె వెనకనే అతడు లోపలకు వెళ్ళాడు. హాలు అందంగా, యింపుగా వుంది. మధ్యలో సోఫాలున్నాయి.

"మీ ఇల్లు రాజభవనంలా వుంది. మాది చిన్న ఇల్లు" అందామె.

ఆమె అతడివంక చూసింది.

"రండి, జీవన్‌తో పరిచయం చేస్తాను" అందామె.

పడగ్గదిలో పరుపుమీద జీవన్ వెల్లకిలా పడుకుని వున్నాడు. అతడి కళ్ళు ప్రకాశిస్తున్నాయి.

"జీవన్, రాజారావుగారు యీయనే" అందామె.

జీవన్ అతనితో కరచాలనం చేశాడు. మంచం పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. జీవన్ పక్కమీద ఆమె చతికిలబడింది.

అతడివైపు రాజారావు సూటిగా చూశాడు. జీవన్ యువకుడు. రెండు కాళ్ళూ మోకాళ్ళదాకా తీసేశారు.

"మేనక మీ గురించి చెప్పింది. మీరు ఆమెను చాలా మర్యాదగా చూశారని విన్నాను. మీరు యిక్కడే ఉండాలి" అన్నాడతను.

"డోంట్ బాదర్, హోటల్ తాజ్‌లో గది తీసుకున్నాను. ఈ పట్నంలో ఉన్నంత కాలం రోజూ వచ్చి మిమ్మల్ని చూస్తుంటాను" అన్నాడు రాజారావు.

రాజారావు చూపు ఆమెవైపు తిరిగింది.

"మేనకా, నీతో బిజినెస్ విషయాలు మాట్లాడాలి" అన్నాడతను.

"మా ఆఫీసు ముందున ఉంది, పదండి" అందామె.

ఇద్దరూ ఆఫీసు గదిలోకి వెళ్ళారు. ఆమె కెదురుగా అతడు కూర్చున్నాడు.

"మీకు స్టాఫ్ లేరా?"

"లేరు. అన్ని పనులూ నేనే చూసుకుంటాను. ఒక ఆఫీస్‌బాయ్ ఉన్నాడు. వాడు పనిమీద వెళ్ళాడు. చెప్పండి!"

"మేనకా, ఐ లవ్ యు!" అన్నాడతను ఉద్రేకంతో.

"అది చాలాసార్లు చెప్పారు" అందామె.

ఆమెవైపు చూస్తూ వుండిపోయాడతను. ఆమె చెయ్యి పట్టుకున్నాడు. విదిలించుకుని చెయ్యిని వెనక్కి తీసుకుందామె.

"జీవన్ బాధపడ్డం నా కిష్టంలేదు. అతడికి కాళ్ళు లేకపోవచ్చు కాని కళ్ళున్నాయి. ఇటుపైన నా చెయ్యి పట్టుకోకండి, ప్లీజ్!" అందామె.

"మేనకా!, అతడు యీ లోకంలో యేమీ సాధించ లేడు. నీకు యేమీ యివ్వలేడు. అతడి కంటి పెట్టుకుని నీ జీవితాన్ని పాడు చేసుకోకు!"

"అతడు నాకేమి యివ్వలేకపోవచ్చు. కాని నే నతనికి యెంతో యివ్వగలను. నేను యెదుట ఉంటే కాళ్ళు లేవన్న విషయం అతడు మర్చిపోతాడు."

"యూ ఆర్ మాడ్!"

టెలిఫోన్ మ్రోగింది. ఆమె ఏదో మాట్లాడి రిసీవర్ని అతడి కిచ్చింది.

"హలో రాజారావు హియర్" అన్నాడతను.

"సార్ రామ్మూర్తిని. అమ్మగారు గాస్ సిలండర్ యాక్సిడెంట్‌లో మరణించారు. పోలీసులు వచ్చారు" అన్నాడతను.

"బాడ్ న్యూస్."

"మీరు వస్తున్నారా?"

"తర్వాత ఫోన్ చేసి చెప్తాను" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

"ఏమైంది?" అడిగింది మేనక.

"గ్యాస్ సిలండర్ యాక్సిడెంట్‌లో నా భార్య మరణించిందట."

"ఎప్పుడు?"

"వివరంగా తెలియదు."

"మీరు బొంబేకి ఎప్పుడొచ్చారు?

"నేను ఢిల్లీ వెళ్ళి అక్కడ నుంచి యివాళ యిక్కడి కొచ్చాను."

"చాలా విచారకరమైన వార్త. "మీరు వెంటనే

మద్రాసు వెళ్ళండి" అందామె.

"వెళ్ళి యేం చెయ్యాలి?"

"ఆమె మీ భార్య. ప్రమాదవశాత్తూ మరణించింది. వెళ్ళి చూడండి" అందామె.

"నువ్వు చెప్పావని వెళ్ళాలి!"

"అందుకే నా వెళ్ళండి" అందామె.

అతడు కుర్చీలోంచి లేచాడు. ఆమెవైపు సూటిగా చూశాడు.

"మేనకా, ఒక అడ్డుగోడ కూలిపోయింది!" అన్నాడతను.

"ఎందుకు?"

"మనం దగ్గరవాలని దేవుడు ఆదేశిస్తున్నట్లు అగుపిస్తోంది!"

"ఆమె అతడివైపు అదోలా చూసింది.

"మీది చాలా కఠిన హృదయం అనుకుంటాను. నీ భార్య పోయింది బావా అంటే మరదల్ని పెళ్ళాడ్తా నన్నట్టుంది మీరు చెప్పేది." అందామె.

రాజారావు సిగరెట్ వెలిగించాడు.

"మీరు ఇంటికి ఎస్.టి.డి. కాల్ చేసి వస్తున్నానని చెప్పండి" అందామె.

"అలాగే చేస్తాను" అన్నాడతను.

ఏదో పిలుపు విని ఆమె లోపలకు వెళ్ళింది. టేబుల్ మీదున్న రిసీవర్ని ఎత్తి అతడు తిప్పాడు. అటువైపు నుంచి రామ్మూర్తి కంఠం వినపడింది.

"రామ్మూర్తీ నేను యివాళ వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేశాడు.

10

బాత్రూమ్‌లో లైట్లు వెలుగుతున్నాయి.

సోఫాలో రాజారావు కూచ్చుని విస్కీ సేవిస్తున్నాడు.

అతడు వాచ్ చూశాడు. పది అయింది.

"మీ కోసం సత్తిరాజు అనే అతను వచ్చాడు" అన్నాడు రామ్మూర్తి.

"రామ్మూర్తీ, టేబుల్ మీద ఒక రమ్ బాటిల్, గ్లాసు, సోడాబుడ్లు పెట్టు. అతడిని లోపలకు రమ్మను. మళ్ళా నేను పిల్చినదాకా నువ్వు లోపలకు రావద్దు" అన్నాడతను.

"అలాగే సార్!"

టేబుల్ మీద అన్నీ పెట్టి రామ్మూర్తి బయటకు వెళ్ళాడు. కాస్సేపట్లో సత్తిరాజు లోపలకు వచ్చాడు.

సన్నగా పొడుగ్గా ఉన్నాడతను. పైజామా, జుబ్బా ధరించాడు. చిన్న కళ్ళు, నల్లటి మనిషి.

"కూర్చో!" అన్నాడు రాజారావు.

"నమస్కారాలు" అని సత్తిరాజు కూర్చున్నాడు.

"పోసుకు తాగు!" అన్నాడతను.

గ్లాసులో రమ్ పోసుకుని సోడా కలపకుండా సత్తిరాజు తాగేశాడు.

"ఈ ఫోటో చూడు" అన్నాడు రాజారావు.

ఫోటోను అతిడు పరీక్షగా చూశాడు.

"అతడు బొంబేలో వుంటాడు. అడ్రెసు యిస్తాను. అతడిని చంపాలి!"

"వెంటనే చంపేస్తాను, సార్!"

"నువ్వు పట్టుబడకూడదు!"

సత్తిరాజు నవ్వాడు.

"650 మందిని చంపాను, సార్! ఇంకా పట్టుబడలేదు" అన్నాడతను సగర్వంగా.

"ఎంత కావాలి?"

"హత్యకో లక్ష. అది నా రేటు, సార్."

"ఇస్తాను."

"యాభై వేలు అడ్వాన్స్‌గా యివ్వాలి. పని పూర్తి చేశాక మిగతాది యివ్వొచ్చు."

రాజారావు బాగ్ తెర్చి ఐదు నోట్ల కట్టలు అతడికిచ్చాడు.

"ఒక్కో కట్టలో పదివేలు వుంటుంది."

"సత్తిరాజు డబ్బును తన బాగ్‌లో పడేసుకున్నాడు.

"ఇది అతని బోంబే అడ్రెసు" అని ఒక స్లిప్‌ను సత్తిరాజు కిచ్చాడు.

"విమానంలో బోంబే వెళ్తాను. తాత్కాలికంగా ఖర్చులకు మరో ఐదు వేలు మీరు తర్వాత యివ్వాలి" అన్నాడు సత్తిరాజు.

"ఇస్తాను."

"ఫోటోను, అడ్రెస్ స్లిప్‌ను సత్తిరాజు దాచుకున్నాడు. "నేనిక వెళ్తాను సార్?"

"గుడ్‌లక్! ఆ బాటిల్ నీది. తీసుకెట్!"

రమ్ బాటిల్ను సత్తిరాజు బాగ్‌లో పెట్టుకొని సోఫాలోంచి లేచాడు. రాజారావుకి నమస్కరించి అతడు వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోయాక రాజారావు బయటకు వెళ్ళి

రామ్మూర్తిని పిల్చాడు.

రామ్మూర్తి వేగంగా లోపలకొచ్చాడు.

"అతడు యిక్కడకు ఎలా వచ్చాడు?"

"మోటర్ బైక్ మీద, సార్."

"ఫిల్ ది గ్లాస్!" అన్నాడు రాజారావు.

గ్లాసులో స్కాచ్ విస్కీ పోసి, సోడా కలిపి, ఐస్ క్యూబ్స్ పడేశాడు రామ్మూర్తి.

ఉషారుగా గ్లాసును అందుకున్నాడు.

11

రోజులు దొర్లి పోతున్నాయి. సత్తిరాజు రాకకోసం అతడు ఎదురుచూస్తున్నాడు.

రాజారావు బాత్రూమ్‌లో కూర్చుని విస్కీ సేవిస్తున్నాడు. టెలిఫోన్ మ్రోగింది.

"మీ కోసం సార్" అన్నాడు రామ్మూర్తి.

"హాలో రాజారావ్ హియర్!"

"సత్తిరాజు, సార్. పని పూర్తయింది. రేపటి ప్లేనులో వస్తున్నాను. మిమ్మల్ని కలుసుకుటాను" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

రాజారావు ఉషారుగా విస్కీ సేవించాడు. ఇప్పుడు మేనక తనని తప్పక పెళ్ళాడుతుంది! ఏ అడ్డంకులూ లేవు!

రాత్రి రెండు దాకా అతడు తాగుతూనే వున్నాడు. మేనక అతని హృదయంలో నృత్యం చేస్తోంది.

తెల్లవారింది. అతడు ఆఫీసుకు పోలేదు. బాత్రూమ్‌లోనే కూర్చుని వుండిపోయాడు.

సాయంత్రం ఐదింటికి వచ్చాడు సత్తిరాజు. రామ్మూర్తిని అతడు బయటకు వెళ్ళమన్నాడు. యాభై

అయిదువేలు తీసి అతడి కిచ్చాడు.

సత్తిరాజు నోట్ల కట్టలను దాచుకున్నాడు.

"నిన్నెవరూ చూడలేదుగా?" అడిగాడు రాజారావు.

సత్తిరాజు నవ్వాడు.

"హత్య చేస్తూంటే నన్ను యెవరేనా చూస్తే వాళ్ళు బ్రతికుండరు, సార్. అక్కడ యిదే జరిగింది. అతడిని షూట్ చేస్తూంటే ఒక యువతి నాకు అడ్డుపడింది. నాతో పోట్లాడింది. ఆమె చాలా అందంగా వుందిసార్, అయినా ఆమెను చంపవలసి వచ్చింది. తర్వాత అతడిని చంపాను" అన్నాడు సత్తిరాజు.

సత్తిరాజు అతడివైపు చూశాడు.

రాజారావు నోటమ్మట మాటరాలేదు. అతడలాగే సోఫాలో పక్కకు పడిపోయాడు.

అతడికి యేమైందో తెలియని సత్తిరాజు మెల్లిగా బయటకు నడిచాడు.

రాజారావు పిలుపుకోసం రామ్మూర్తి కాచుకు కూర్చున్నాడు. యెంతకీ పిలుపురాక బాత్రూమ్‌లోకి వెళ్ళాడు. సోఫామీద పడున్న రాజారావును తట్టాడు, "సార్, సార్!" అని పిల్చాడు.

అతడిని ముట్టుకు చూశాడు. గాభరాగా నాడిని పరీక్షించాడు. కొట్టుకోడంలేదు. వెంటనే డాక్టర్ చలపతికి ఫోన్ చేశాడు.

డాక్టర్ చలపతి వచ్చి రాజారావును పరీక్షించాడు.

"ఆయన చనిపోయారు!" అన్నాడు డాక్టర్.

"వారం రోజులనుంచి ఆయన విపరీతంగా విస్కీ తాగుతూ వుండేవారు. నేనెంత వద్దన్నా వినేవారు కాదు" అన్నాడు రామ్మూర్తి.

"విధి అలా చేయిస్తుంది."

"ఇప్పుడు ఏం చెయ్యాలి సార్?"

"ఆయన అడ్వకేట్‌కి ఫోన్ చేసి యీ వార్త చెప్పు" అన్నాడు డాక్టర్ చలపతి.

డాక్టరు చలపతి దీనంగా రాజారావువైపు చూస్తూ నిలబడ్డాడు. రామ్మూర్తి టెలిఫోన్ వైపు నడిచాడు.

—:అయిపోయింది:—